# పొట్లం

## బాలం వెంకట్రావు



పైట కొంగుతో చేతులు తుడుచుకుంటూ వంటింట్లోనుండి బయటికి వచ్చింది కమల. గుమ్మం వీధికెదురుగా వుండటంవలన చాల దూరంలో భర్త నడిచిరావటం కంటపడింది.

అతని చేతిలో ఒక పొట్లం వుండటం కూడా గమనించింది. పొట్లం ఏమైవుంటుంది చెప్మా అని ఆలోచనలో పడింది. ‘తను ఎన్నిరోజులనుండో అడిగే పూరీ కర్ర, పీట తెస్తున్నారా? జాకెట్ గుడ్డలు తెస్తున్నారా? యిప్పుడున్న జాకెట్లు పాతవైపోయి తొడుక్కోగానే పిగిలిపోతున్నాయి ... లేక యింట్లోకి వెచ్చాలు ఏమైనా తెస్తున్నారా? ఎంత పొదుపుగా వాడుతూ వచ్చినా వెచ్చాలు చాలడంలేదు. నలుగురు బ్రతకాలి.

—ఆలోచిస్తూ అలాగే నిలబడిపోయింది భర్త చేతిలోని పొట్లంవంక చూస్తూ.

ఇంతలో అక్కడికి కూతురు వచ్చింది వచ్చీరాగానే నడిచి వస్తున్న తండ్రిని చూసి, అతనిచేతిలోని పొట్లాన్ని పసిగట్టేసింది. తను అడుగుతూవున్న ఎంబ్రాయిడరీ వలయమో, లేక సంచులు అల్లడానికి ప్లాస్టిక్ నారో తెస్తున్నాడని కుతూహలపడింది. అమాయక మనసు



ఆగలేక, "అమ్మా! అమ్మా! నేను నాన్నగార్ని రోజూ అడిగే ప్లాస్టిక్ దారం తెస్తున్నారే!" అని సంబరపడిపోయింది. సంతోషపడిపోయింది. ఆ సమయానికి కొడుకూ వచ్చాడక్కడికి.

తండ్రి పొట్లం పట్టుకురావడం చూసి "నాన్న నాకు జామెంట్రీ బాక్సు, లెక్కల పుస్తకాలు, నోట్సు తెస్తున్నాడు" అని చేతులు చరుచుకున్నాడు ఆనందంతో.

"కాదు, నాకు ప్లాస్టిక్ దారం తెస్తున్నారు" అది కూతురు.

"కాదు, పుస్తకాలే తెస్తున్నారు" అన్నాడు కొడుకు

ఇద్దరికీ వాదన పెరిగే లోపు, "ఆగండర్రా! ఏదో ఒకటి ఎవరికో ఒకరికి ఈ రోజు తెస్తున్నారు. రేపు ఇంకొకరికి తెస్తార్లే" అని సర్దింది తల్లి.

"ఏమిటీ! ముగ్గురూ నన్ను తదేకంగా చూస్తూ నిలబడ్డారు!" అంటూ వాకిట్లోనే ఆగిపోయాడు రామం.

"మిమ్మల్ని కాదులెండి, చూసేది! మీ చేతిలోని పొట్లాన్ని" అంది భార్య.

"పొట్లాన్నా? దేనికీ!!" ఆశ్చర్యపోయి తన చేతిలోని పొట్లాన్ని తిప్పి తిప్పి చూసుకున్నాడు.

"ఆ పొట్లంలో ఎంబ్రాయిడరీ వలయం, ప్లాస్టిక్ దారం వుందంటోంది అమ్మాయి. కాదు, జామెంట్రీ బాక్సు, పుస్తకాలు వున్నాయంటున్నాడు అబ్బాయి," అంది భార్య.

రామం మనసు గతుక్కుమంది. పిల్లల ఆశల్ని తీర్చగలడా తను?

"మరి నువ్వేమనుకుంటున్నావో అదీ చెప్పేసెయ్యి" అన్నాడు, జాలిగా భార్యను చూస్తూ

"పూరీ కర్రో, పీటో, జాకెట్

ముక్కలో లేక వెచ్చాలో అయివుంటా యనుకుంటున్నాను" అంది ఆశగా.

"కాదు కమలా కాదు. మీరడిగేవి ఏవీ ఈ పొట్లంలో లేవు. అసలు ఈ పొట్లమే మనది కాదు. నా స్నేహితుడిది. అవసరంగా అతను ఆఫీసునుండి అటే వెళ్ళిపోయాడు ఆఫీసు పనిమీద. వెళ్తూ ఈ పొట్లాన్ని తన యింట్లో యిమ్మని ప్రాధేయ పడ్డాడు. వెళ్ళి యిచ్చిరావాలి. ఈ పొట్లంలో ఏముందో నా కసలు తెలియదు" అన్నాడు రామం.

పిల్లలిద్దరూ చప్పబడిపోయి లోపలి కెళ్ళిపోయారు. భార్య వెళ్ళబోయింది, ఏమీ మాట్లాడలేక.

"ఇదిగో, నిన్నే! నీ దగ్గర ముప్పై పైసలుంటే యిస్తావా!" దిగులుగా అడిగాడు భార్యని.

"ముప్పై పైసలా? దేనికి?" విస్తు పోయింది ఆమె.

"రిక్షాకి, వెళ్ళేటప్పుడు రిక్షాలో వెళ్ళి వచ్చేటప్పుడు నడిచివస్తాను, లేకుంటే వెళ్ళేటప్పుడు నడిచివెళ్ళి వచ్చేటప్పుడు రిక్షాలో వస్తాను. స్నేహితుడి కిచ్చిన మాట దక్కించుకోవాలి ప్లీజ్!"అన్నాడు రామం నడిచివెళ్ళి రాలేనన్న బాధతో.

"బావుందండీ వరస! పొట్లాన్ని యివ్వడానికి ముప్పై పైసలు దండగ పడాలా? నా దగ్గర లేవు. మీకు జీతం వస్తేనే పైసల ముఖం చూడబోయేది" అంది నిఖచ్చిగా.

"దేవుడి దగ్గరుండే డబ్బులోనైనా తీసుకురావే! జీతం రాగానే దేవుడి డబ్బుల్లో వేసేద్దాం" అన్నాడు ఎంతో దీనంగా.

భర్త నడిచివెళ్ళి నడిచిరాలేక ప్రాధేయ పడుతున్నాడని గ్రహించి, దేవుడి దగ్గరకెళ్ళి దణ్ణంపెట్టుకుని, లెంపలేసు కుని ముప్పై పైసలు తీసుకొచ్చి యిచ్చింది, యిక ఎప్పుడూ అటువంటి పనులను ఒప్పుకోవద్దని మందలిస్తూ.

తలూపి బయల్దేరాడు రామం. తిన్నగా రోడ్డువారనున్న దుకాణం వద్దకెళ్ళి పొట్లం అతని కిచ్చాడు. ఆ పొట్లంలో వున్నవి తెగిపోయిన చెప్పులు!

ఉదయం ఆఫీసుకు చేరుకునేటప్పుడు చెప్పులు పట్టీలు తెగాయి. చేతితో పట్టుకు రాలేక న్యూస్‌పేపర్లో చుట్టి తెచ్చాడు. చెప్పులున్న పొట్లం ఆశలు రేపింది, ఆలు బిడ్డల్లో. తనను అబద్ధం చెప్పించింది. ఆశలు, అబద్ధాలు మధ్య నలిగిపోతూ తనబోటివారు ఆత్మల్ని సైతం చంపేసు కుని ఎలా బ్రతికేస్తారో ఊహించు కుంటూ ఇల్లు చేరుకున్నాడు రామం," చెప్పుల కాళ్ళతో.